
మామిడికి గడ్డు కాలం


చింతలపూడిలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు


మెట్ట ప్రాంతం తోటల్లో మామిడి కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- మామిడి పంటకు ప్రకృతి దెబ్బ
- ధర ఉన్నా తగ్గిన దిగుబడి
- కుదేలైన రైతులు

చింతలపూడి: మామిడి రైతులు ఈ ఏడాది గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన కాయకు మంచి ధర పలుకుతున్నట్లు ఉద్యానాధికారులు చెబుతున్నారు. ప్రారంభంలో బంగినపల్లి మామిడి టన్ను రూ.80 వేలు పలికిన ధర ప్రస్తుతం టన్ను రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకూ పలుకుతుందని వ్యాపారులు తెలిపారు. అదే తూతాపురి కాయలు టన్ను రూ.15 వేలు పలుకతున్నట్లు చెప్పారు. ఏటా ధరల్లో ఏర్పడుతున్న వ్యాత్యాసాల వలన రైతులు, వ్యాపారులు నష్టాలను చవి చూస్తూ వస్తున్నారు. మామిడి రైతులు ఈ సంవత్సరం పూత దశలోనే నష్టాల ఊబిలో చిక్కుకున్నారు.

ఓ పక్క తెగుళ్లు, మరో పక్క ప్రకృతి దెబ్బ

మామిడికి ఒక పక్క తెగుళ్ల బెడద, మరో పక్క గాలి దుమ్ములతో ప్రకృతి దెబ్బ తగిలింది. ఇది కాకుండా తేనె మంచు పురుగు వలన పూత అధికంగా మాడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో పూత ఆలస్యంగా పూయడం వలన కోతలు ఆలస్యం అవుతున్నాయి. ఫలితంగా ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రతి ఏటా ఈ పాటికే జిల్లాలో మామిడి కోతలు ప్రారంభం అయ్యేవి. ఉగాదికి కమీషన్ వ్యాపారులు దుకాణాలు ప్రారంభించి ఎగుమతులు చేసేవారు. గత వారం రోజులుగా అకాల వర్షాలు, ఈదురు గాలులకు మామిడి కాయలు విపరీతంగా రాలిపోయాయి. దీంతో అటు వ్యాపారులు, ఇటు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒకప్పుడు నియోజకవర్గంలో 50 వేల ఎకరాల్లో విస్తరించి ఉండే మామిడి తోటలు ప్రస్తుతం 10 వేల ఎకరాలకు చేరుకున్నాయి. ఏటా కోట్ల రూపాయల వ్యాపారం సాగించే మామిడి పరిశ్రమ గత కొద్ది సంవత్సరాలుగా సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ప్రతి ఏటా 500 మంది కూలీలు వచ్చి మామిడి ఎగుమతి, బుట్ట ప్యాకింగ్ పనుల్లో పాల్గొనే వారని, ఈ ఏడాది కనీసం 50 మందికి కూడా పని కల్పించలేకపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఇక్కడి నుంచి ముంబాయి, కలకత్తా, నాగపూర్, గుజరాత్, హైదరాబాద్, పూనే, అహ్మదాబాద్, ఢిల్లీ, కాన్పూర్, ఒరిస్సా వంటి ప్రాంతాలకు వ్యాపారులు మామిడి ఎగుమతి చేస్తుంటారు.

వర్షాభావంతో తగ్గిన దిగుబడి



మెట్ట ప్రాంతంలో తేనె మంచు కారణంగా మామిడి తోటలు పూర్తి స్థాయిలో కాయలేదు. ఉన్న కాయ ఎండలకు సైజు రాకుండానే రాలిపోతుండటంతో రైతులు లేత కాయలను కోసి తీసుకొస్తున్నారు. దీనికి తోడు ఈదురు గాలులు, అకాల వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న కాయలు రాలిపోయాయి. ఈ ఏడాది వ్యాపారం అంతంత మాత్రంగా ఉండే అవకాశం ఉంది.

–సీహెచ్ సుధాకర్,
శ్రీనివాస ఫ్రూట్ కంపెనీ, చింతలపూడి

మామిడి రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో మామిడి తోటలు నరికి వేస్తున్నారు. మామిడి రైతులకు రాయితీలు కల్పించి మామిడి విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే భవిష్యత్తులో మామిడి పరిశ్రమ కుదేలు అవుతుంది.

–బొడ్డు వెంకటేశ్వరరావు,
మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

క్లుప్తంగా

విద్యుత్ సరఫరా నిలుపుదల

టి.నరసాపురం: ఈ నెల 17వ తేదీ గురువారం టి.నరసాపురం సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజన్ విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కావున టి.నరసాపురం, మక్కినవారిగూడెం, బండివారిగూడెం, తిరుమలదేవిపేట, మధ్యాహ్నపువారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముగిసిన సర్టిఫికెట్ కోర్సు


కోర్సు పూర్తి చేసిన విద్యార్థులతో అధ్యాపకులు, సిబ్బంది

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐఐటీ బోంబే వారిచే నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌ప్రసాద్‌బాబు తెలిపారు. బుధవారం కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 22 మంది విద్యార్థులు 26 రోజుల పాటు ఇంట్రడక్షన్ టు కంప్యూటర్ అనే అంశంపై శిక్షణ పొందారన్నారు. ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు కైవసం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.ఉత్తమ్‌సాగర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎస్సై

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెండ్యాల అభిషేక్‌బాబు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ సాయిబాబు, ఎస్సై ఎం.జయబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఆంజనేయులు, కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్వో అడపా సుబ్బారావు, రాజబోయిన రమేష్, బత్తుల రమేష్, కంభంపాటి జోగేశ్వరావు, పాలం మోషే, కొనకళ్ల సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు


అయ్యప్పస్వామి వారు


జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెంలో కొలువైన శ్రీహరి హరసుత అయ్యప్ప స్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ సుబ్రమ్మణ్యేశ్వరి

కొయ్యలగూడెం: పీహెచ్‌సీని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బి.సుబ్రమణ్యేశ్వరీ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులు పొందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రిలో ఫార్మసీ గురించి అదే విధంగా ఆపరేషన్ థియేటర్ల గురించి వైద్యశాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల నూతనంగా హాస్పిటల్‌కు సమకూరిన పరికరాలను పరిశీలించి సాంకేతిక పరికరాల పనితీరును పర్యవేక్షించారు.

దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల ప్రారంభం


దత్తాత్రేయ స్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: అంకాలగూడెంలో నూతనంగా నిర్మించిన ఆలయం వద్ద దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. 18వ తేదీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, క్షీరాధివాసం, అంకురారోహణ, మండపారాధన వంటి ప్రారంభోత్సవ పూజలు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు మామిళ్లపల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ధ్వజారోహణ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో జరిగిన చోరీపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. వివరాల ప్రకారం స్థానిక ఏరియా ఆసుపత్రి స్టాఫ్ నర్సు చటపర్తి గుండమ్మ ఈ నెల 15వ తేదీ ఉదయం 7.30 గంటలకు డ్యూటీకి వెళ్లి తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి వచ్చి చూడగా ఇంటి తాళం, బీరువా పగులగొట్టి ఉండటాన్ని గుర్తించింది. బీరువాలో ఉన్న బంగారు గాజులు, బుట్టా దిద్దులు, చైను, నల్లపూసల గొలుసు, ఉంగరాలు, సూత్రాలు, సూత్రాల గొట్టం, ముక్కుపుడక, వెండి పట్టీలు 2 జతలు చోరీకి గురైనట్లు గుర్తించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ చెప్పారు.

దామరచర్ల ఘర్షణ కేసులో పది మంది అరెస్ట్

కుక్కునూరు: మండలంలోని దామరచర్ల గ్రామంలో ఆదివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి 10 మందిని అరెస్టు చేసినట్లు కుక్కునూరు పోలీసులు తెలిపారు. ఘర్షణలో తీవ్రంగా గాయపడిన దుర్గయ్య కుటుంబ సభ్యులు 10 మందిపై ఫిర్యాదు చేశారన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదులో పేర్కొన్న 10 మందిని అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

బెల్లం వ్యాపారులతో సమావేశం

జంగారెడ్డిగూడెం: బెల్లాన్ని విక్రయించేటప్పుడు వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు అన్నారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బెల్లం వ్యాపారులతో సీఐ శ్రీనుబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారీకి బెల్లం ముఖ్యమైన ముడి సరుకని వ్యాపారులు నాటు సారా తయారీదారులకు బెల్లాన్ని విక్రయించొద్దన్నారు. ఒక వేళ ఎవరైనా అధిక మొత్తంలో బెల్లాన్ని కొనుగోలు చేసినట్లయితే అతడికి సంబంధించిన ఆధార్, మొబైల్ నెంబర్ నమోదు చేసుకోవాలన్నారు. అలాగే బెల్లం క్రయ విక్రయాల చిట్టాను ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రతి వారం అందజేయాలని వ్యాపారులకు సూచించారు. అనుమానితులకు బెల్లం విక్రయించినా, నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణంలో కొరవడిన నాణ్యత


నాణ్యత లోపంతో నిర్మించిన రహదారి

కొయ్యలగూడెం: రోడ్డు నిర్మాణం అధ్వానంగా చేపట్టారని బుధవారం విలేకరుల వద్ద రైతాంగం ఆరోపణలు చేశారు. మిషనరీ హాస్పిటల్ పక్కగా బరియల్ గ్రౌండ్‌కు వెళ్లే దారిలో రూ.4 లక్షల మండల పరిషత్తు నిధులతో నాలుగు వందల మీటర్ల మేర రోడ్డు నిర్మించారన్నారు. అయితే నాణ్యత లేకుండా నిర్మించడంతో పశువులు నడుస్తుంటేనే గుంతలు పడుతున్నాయన్నారు. రోడ్డు నిర్మాణం వలన రైతాంగానికి మేలు కలుగుతుందనుకుంటే తీరా వేసిన నాలుగు రోజుల్లోనే రోడ్డు డొల్లతనం బయటపడిందన్నారు. రహదారి నిర్మాణ సమయంలో చెత్తలో నుంచి రోడ్డు వేశారని రహదారి మార్జిన్ గుంతలు పడి అధ్వానంగా తయారైందన్నారు. సమీపంలోని చెత్తాచెదారం వ్యర్థాలు రోడ్డు మార్జిన్ పైనే పడేస్తుండడంతో దుర్గంధం కలుగుతుందన్నారు. దీనిపై ఏఈ మాట్లాడుతూ చట్రు రోడ్ నిర్మించామనే ఆరోపణలను పరిశీలిస్తామన్నారు. బుధవారం రోడ్డును పరిశీలిస్తామని పంచాయతీ రాజ్ డీఈ సీతయ్య పేర్కొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం



పల్లంలోకి దూసుకెళ్లిన ప్రైవేట్ పాఠశాల బస్సు

టి.నరసాపురం: అదుపు తప్పి స్కూల్ బస్సు పల్లంలోకి దూసుకెళ్లిన ఘటనలో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇవీ.. మండలానికి చెందిన విద్యార్థులు కామవరపుకోటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్నారు. బుధవారం పాఠశాల ముగిసిన అనంతరం స్కూల్ బస్సు విద్యార్థులను వారింటికి తీసుకెళుతోంది. మండలంలోని తెడ్లం సమీపానికి వచ్చే సరికి బస్సు అదుపు తప్పి, రోడ్డు పక్కనే పల్లపు పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న 20 మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. పెను ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు ఫిట్‌నెస్ సరిగా లేకపోవడం వంటి కారణాలతోనే స్కూల్ బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని విద్యార్థుల తల్లితండ్రులు వాపోతున్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలని ధర్నా



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో వేలేరుపాడు మండలం గుండ్లమడుగు గ్రామానికి చెందిన గ్రామస్తులు బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కట్టం ముత్యాలరావు మాట్లాడుతూ గుండ్లమడుగు గ్రామంలో సుమారు 70 మంది ఆదివాసీలు 250 ఎకరాల పోడు వ్యవసాయ భూముల్లో పలు రకాల పంటలను పండిస్తున్నారన్నారు. అయితే ఆ భూములకు నేటికీ పట్టాలు లేవని దీని వలన గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఒక వినతిపత్రాన్ని ఐటీడీఏ మేనేజర్ పి.ప్రకాష్‌కు, ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావుకు అందజేశారు. మిర్యాల సీతారాములు, పాయం వెంకటేష్, కలుము కల్పన, కట్టం సత్యవతి పాల్గొన్నారు.

వంట గ్యాస్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలి


జంగారెడ్డిగూడెం: గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


చింతలపూడి: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జంగారెడ్డిగూడెం: అపార్ట్‌మెంట్లలో వంటగ్యాస్ వాడకంపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి జి.అబ్రహం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పట్టణంలోని శ్రీహోమ్స్ అపార్ట్‌మెంట్ వద్ద అగ్నిమాపక శాఖ సిబ్బంది వంట గ్యాస్ వినియోగం, అగ్ని ప్రమాదాల్లో పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కర పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై మహిళలు జాగ్రత్తగా ఉండాలి

చింతలపూడి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శ్రీనివాస ఎన్‌క్లోజ్ అపార్ట్‌మెంట్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ లీకై అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే దగ్గరలోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలని చెప్పారు. ముఖ్యంగా మహిళలు వంట చేయడం పూర్తయ్యాక గ్యాస్ సరఫరాను నిలిపివేయాలని సూచించారు. గ్యాస్ లీకవుతున్నా, ఇతర సమస్యలు వచ్చినప్పుడు వంట గది కిటికీలు తెరచి ఉంచాలని చెప్పారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి కె.వెంకటరెడ్డి ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై శిక్షణ


పీహెచ్‌సీలో మలేరియా వ్యాధి నిర్మూలనపై శిక్షణ ఇస్తున్న వైద్యులు

కొయ్యలగూడెం: మలేరియా వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నిర్మూలనపై అవగాహన సదస్సు బుధవారం పీహెచ్‌సీలో నిర్వహించారు. డీఎంవో పీఎస్ ప్రసాద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జి.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాధి నిరోధానికి, నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యల గురించి డెమో చేస్తూ అవగాహన కల్పించారు. సీహెచ్ఓ శ్రీనివాస్ మలేరియా వ్యాధి ఏజెన్సీ ప్రాంతాలలోనే ఎక్కువగా విస్తరిస్తోంది అని అన్నారు. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలోని పదిహేను పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు, కొయ్యలగూడెం, బయ్యనగూడెం బుట్టాయగూడెం, కుక్కునూరు, పోలవరం సబ్ యూనిట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూటమి హామీలు అమలు చేయాలి


పోలవరం రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


ద్వారకాతిరుమల: ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నేత లింగరాజు

పోలవరం రూరల్: కూటమి ప్రభుత్వం సామాన్యులపై విద్యుత్ చార్జీలభారాలు మోపడం దురదృష్టకరమని సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని పోలవరం విద్యుత్ ఉప కేంద్రం వద్ద సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎన్నికల హామీలు అమలు చేయాలనీ, ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, విద్యుత్ చార్జీలు పెంచొద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కారం భాస్కర్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, నాణ్యమైన కరెంట్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. బొరగం భూచంద్రరావు, మడివి చలపతిరావు, గోకూరి పాండవులు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

ద్వారకాతిరుమల: ఉపాధి హామీ కూలీల వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. పంగిడిగూడెంలో బుధవారం లింగరాజు, సీపీఎం మండల ఆర్గనైజర్ కట్టా భాస్కరరావు, మానుకొండ వీర్రాజులు ఉపాధి కూలీలు వద్దకు వెళ్లి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రతినిధులు కూలీల బకాయిల విడుదలకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామస్తుల శ్రమదానం


పాఠశాల పాకను సిద్ధం చేస్తున్న గ్రామస్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన రౌతుగూడెంలో విద్యార్థుల కోసం గ్రామస్తులు శ్రమదానం చేసి పాఠశాల పాకను బుధవారం ఏర్పాటు చేశారు. సుమారు 15 మంది రౌతుగూడెం గ్రామానికి చెందిన పిల్లలు ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. ఆ గ్రామానికి పాఠశాల లేకపోవడంతో పాకలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది వర్షం కురుస్తుందని పాకపైన బరకాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులు మాజీ సర్పంచ్ గురుగుంట్ల గంగిరెడ్డి, పీసా కమిటి మెంబర్ గోగుల చిన్నయ్య, వార్డ్‌మెంబర్ గోగుల శ్రీను, గురుగుంట్ల ముక్కారెడ్డి, తదితరుల ఆధ్వర్యంలో తాటాకు పాకను బాగు చేసి సిద్ధం చేశారు.

స్త్రీ శక్తి మహిళా సంఘ సమావేశం

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి కావస్తున్నా నేటికీ ఒక్క హామీ అమలు చేయలేదని సీపీఐఎంఎల్ ప్రజా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలింపుడి సుందర్‌రావు అన్నారు. వేగవరంలో సీపీఐఎంఎల్ ప్రజా పోరాట సమితి కార్యాలయంలో సావిత్రిబాయి స్త్రీ శక్తి మహిళా సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సీహెచ్ వెంకట్, సావిత్రిబాయి స్త్రీ శక్తి మహిళా సంఘం నాయకులు షేక్ షఫీక, కుమారి, ఎం.మరియమ్మ, నువ్వులు కుమారి, పెట్ల మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

చింతలపూడి: తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. డీసీహెచ్‌ఎస్ పాల్‌సతీష్ పాల్గొన్నారు.

వైద్య పరికరాల వితరణ


వైద్య పరికరాలు అందిస్తున్న ఏఎస్‌ఆర్ చౌదరి ఫౌండేషన్ ప్రతినిధులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అల్లూరి సర్వారాయుడు చౌదరి ఫౌండేషన్ నవ భారత్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఆసుపత్రి పరికరాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ పీఆర్ఓ రాఘవరావు మాట్లాడుతూ రూ.5.50 లక్షల విలువ చేసే ఆసుపత్రికి పరికరాలను ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించారు. రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనర్, ఏవో ప్లాంట్ వాషింగ్ మిషన్, మూడు సీట్ల కుర్చీలు, రివాల్వింగ్ కుర్చీలు, ఆఫీసు టేబుళ్లు, నాలుగు దశల ఇనుప ర్యాక్‌లు, పోర్టబుల్ చూషణ యంత్రం, పోర్టబుల్ ఫ్యూమిగేషన్ మిషన్, ఎక్స్‌రే వీక్షణ పెట్టె, వార్డ్ రోబ్, చక్రాల కుర్చీ, కంప్యూటర్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు కె.నవీన్, టి.సుష్మ, ఆయిల్ పామ్ రైతులు కొల్లూరు శ్రీనివాసరావు, నవభారత్ ఇండియా సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పోలవరం రూరల్: మండలంలోని పట్టిసీమ సొసైటీలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించి, రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఏవో కె.రాంబాబు వివరాలు వెల్లడించారు. రైతులకు సమస్యలు, లేదా వివరాలు కావాలంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1967 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ 7702003584 18004256453 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎ.సాయిరాజు, మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత


భద్రం కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కుక్కునూరు: మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్ వంట మనిషిగా పని చేసిన బుయ్యన భద్రం కుటుంబానికి పూర్వ విద్యార్థులు సహాయం అందించారు. ఇటీవల భద్రం అకాల మరణం పొందారు. దీంతో సంక్షేమ హాస్టల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు భద్రం కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి అప్పటి వార్డెన్ విజయభాస్కర్‌రావు సహాయంతో ఆ కుటుంబానికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థులు రాయి రవి, బల్లెం వెంకటేశ్వర్లు, మాచర్ల పోతురాజు, బుయ్యని వీరబాబు, కోట వెంకటేశ్వర్లు, లకమల్ల వెంకట రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేరన్ దగ్ధం

బుట్టాయగూడెం: కొమ్ముగూడెంలో బుధవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో ఒక పొగాకు బేరన్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆలపాటి వెంకట రమణమూర్తి అనే రైతు పొగాకు క్యూరింగ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామస్తులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్టు రైతు వెంకట రమణమూర్తి తెలిపారు.